నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, బుధవారం 9 ఏప్రిల్ 2025 | KHAMMAM

# పెంచిన వంట గ్యాస్ ధర తగ్గించాలి

## ఖమ్మంలో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం కమాన్‌బజార్, ఏప్రిల్ 8: పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖమ్మం బైపాస్‌రోడ్డులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత బాగం హేమంతరావు మాట్లాడుతూ.. కార్పొరేట్ల సేవలో తరిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. గ్యాస్ ధర పెంచి పేదలపై భారం మోపుతోందని ఆరోపించారు. పార్టీ నాయకులు దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, నర్సింహారావు, పోటు కళావతి, సలాం తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

# 'ఆరో బెటాలియన్'కు రూ.20 లక్షలు

## రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు నిధుల నుంచి మంజూరు

ఖమ్మం, ఏప్రిల్ 8: భద్రాద్రి జిల్లా చాతకొండలోని ఆరో బెటాలియన్‌లో పలు అభివృద్ధి పనుల కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు నిధుల కేటాయింపు లేఖను సంబంధిత అధికారులకు మంగళవారం అందజేశారు. బెటాలియన్ కమాండెంట్ డీ.శివప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ జీవీ రామారావులు ఖమ్మంలో ఎంపీ రవిచంద్రను ఇటీవల కలిశారు. కొత్తగా ఏర్పడిన తమ బెటాలియన్‌కు ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేస్తే సెల్యూటింగ్ డయాస్, గ్యాలరీ నిర్మాణ పనులు చేపడతామని అన్నారు. ఈ మేరకు వద్దిరాజు తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారు. అందుకు సంబంధించిన లేఖను బెటాలియన్ కమాండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రకు బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



నిధుల మంజూరు పత్రం అందజేస్తున్న వద్దిరాజు

# వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులు

## మోదీ విధానాలకు వ్యతిరేకంగా కలెక్టరేట్ల ఎదుట మాస్‌లైన్, ప్రజాపంథా నేతల ధర్నా

ఖమ్మం/ కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఏప్రిల్ 8: వ్యవసాయ రంగంలోని ప్రతి విభాగంలోకీ విదేశీ కార్పొరేట్ శక్తులు వచ్చేలా మోదీ ప్రభుత్వం తలుపులను బార్లాగా తెరిచి రైతులకు నష్టం చేస్తోందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నేతలు రంగారెడ్డి, గుమ్మడి నర్సయ్య (మాజీ ఎమ్మెల్యే) విమర్శించారు. ఆ పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు కేంద్రంలోని మోదీ విధానాలను నిరసిస్తూ ఆ పార్టీ ఖమ్మం, భద్రాద్రి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఖమ్మం, కొత్తగూడెంలలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. తరువాత కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు, వేతనాలు, భద్రత, రైతుల పంటలకు మద్దతు ధర, పంట రుణాల రద్దు వంటి సమస్యలపై దేశంలోని కార్మిక కర్షక వర్గాలు కేంద్ర ప్రభుత్వంపై పోరాడుతున్నాయని అన్నారు. అయితే వీటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, హిందువులను ఆకర్షించేందుకు మోదీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్, బీజేపీ పాసిస్టు విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే 1773లో చనిపోయిన ఔరంగజేబు సమాధి గొడవను రేకెత్తిస్తోందని విమర్శించారు. ఇలాంటి మోదీ ప్రభుత్వంపై ప్రజలు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.





ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు





భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు




ఖమ్మం మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

# మిర్చి రైతు దగా

- ఖమ్మం ఏఎంసీలో క్వింటా రూ.13,300 వద్దే ఆగిన రేటు
- రోజురోజుకూ దిగజారుతున్న 'ఎర్ర బంగారం' ధర
- వ్యాపారుల చేతిలో దోపిడీకి గురవుతున్న మిర్చి రైతులు
- నిరుడు రూ.23 వేల పైచిలుకు.. నేడు రూ.14 వేలలోపే..
- వ్యవసాయ మార్కెట్‌లో కుమ్మక్కవుతున్న వ్యాపారులు

రఘునాథపాలెం, ఏప్రిల్ 8: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రైతు నిలువు దోపిడీకి గురవుతున్నారు. మార్కెట్‌లో తిష్ట వేసుకొని కూర్చున్న వ్యాపారులు 'మేం చెప్పిందే ధర.. చేసిందే శాసనం' అన్నట్లుగా వ్యవహరిస్తూ అన్నదాతలను నిలువునా ముంచుతున్నారు. జెండా పాటతో సంబంధం లేకుండా మిర్చి విక్రయాలను జరుపుతూ రైతులను నిండా మోసం చేస్తున్నారు. ఫలితంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 'ఎర్ర బంగారం' ధర దారుణంగా పతనమవుతోంది. రోజురోజుకూ క్షీణించిపోతోంది. ఈ మధ్య కూడా ఒకానొక దశలో రూ.14 వేలకు చేరిన క్వింటా ధర.. నాలుగు రోజుల్లోనే మళ్లీ రూ.800 పతనమైంది.

నిరుడు ఇదే సమయంలో ఈ మార్కెట్‌లో క్వింటా రూ.23 వేలకు పైచిలుకు ఉన్న మిర్చి ధర ఇప్పుడు దాదాపుగా సగం ధరే పలుకుతోంది. మార్కెట్‌లో తిష్టేసిన దళారులే ఇందుకు ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. నిరుడు ఇదే మార్కెట్లో రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకూ వెచ్చించి వ్యాపారులు కొనుగోలు చేశారు. క్వింటా రూ.30 వేలకు చేరుతుందని ప్రచారం జరిగింది. దీంతో వ్యాపారులంతా పెద్ద ఎత్తున రైతుల నుంచి పంటను కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. అయితే నాడు మార్కెట్ వ్యాపారుల ఆశలు అడియాశలయ్యాయి. రైతుల వద్ద నుంచి వ్యాపారుల చేతికి పంట వచ్చాక ఆఖర్లో ధర కొంత తగ్గిపోయింది. దీంతో చేసేదేమీలేక వ్యాపారులందరూ ఆ పంటను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకోలేక అగ్గువకు అమ్ముకున్నారు. దీంతో వారంతా నిరుటి నష్టాలను పూడ్చుకునే ఆలోచన చేసి ఈ ఏడాది సిండికేట్ అయ్యారు. ఫలితంగా మిర్చి ధర క్వింటా రూ.13,300 వద్దనే ఆగిపోయింది. ఈ ఏడాది సీజన్ మొదట్లో రూ.14 వేలకు చేరినప్పటికీ ఆ తరువాత రోజు రోజుకూ తగ్గుముఖం పడుతూ వస్తోంది. చివరకు నాణ్యమైన మిర్చి ధరను కూడా గరిష్టంగా రూ.13,500 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇక తేమ శాతం, రంగు వంటి కారణాలు చూపుతూ రైతుల పంటను తిరస్కరిస్తున్నారు. లేదంటే తాము చెప్పిన తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో రోజురోజుకూ తగ్గుతున్న ధర.. మిర్చి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. నిరుడు సిరులు కురిపించిన మిర్చి ఈ ఏడాది రూ.13 వేలకు దిగువన రావడంతో మిర్చి రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.



### తెగుళ్లు, వరదలతో తగ్గిన దిగుబడి..

ఈ ఏడాది అధిక ధర లభిస్తుందన్న కారణంతో రైతులు కూడా ఎక్కువ విస్తీర్ణంలో మిర్చిని సాగు చేశారు. కానీ.. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. తెగుళ్లు, వరదలు, వాతావరణ పరిస్థితులు దెబ్బతీయడంతో దిగుబడి బాగా తగ్గింది. దీంతో డిమాండ్ పెరిగి అధిక ధర పలుకుతుందని రైతులంతా ఆశించారు. తీరా మార్కెట్‌కు వస్తే భంగపాటే మిగిలింది. వ్యాపారులంతా సిండికేట్ కావడంతో ధరలు గణనీయంగా పడిపోయాయి. గత వారం రోజులుగా రోజుకు రూ.200 నుంచి రూ.300 చొప్పున తగ్గుతూ వస్తున్నదే తప్ప పెరిగిన పరిస్థితి లేదు. దీంతో వ్యయ ప్రయాసలకోర్చి మార్కెట్‌లో విక్రయించుకునేందుకు పంటను తీసుకొచ్చిన రైతులకు వ్యాపారులు సగటున రూ.13 వేల వద్ద ధరలు చెబుతున్నారు. దీంతో తిరిగి తీసుకెళ్లేందుకు మళ్లీ ఖర్చులు భరించలేని రైతులు.. వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించుకొని నిలువు దోపిడీకి గురవుతున్నారు. దీనికితోడు రానున్న రోజుల్లో ధరలు మరింత తగ్గుతాయేమోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. అయితే, ఈ ఏడాది చైనాకు మిర్చి ఎగుమతులు లేకపోవడంతోనే ధర తగ్గుదలకు కారణమని కొందరు వ్యాపారులు చెబుతున్నారు.

### అగ్గువకు అమ్మలేక నిల్వ చేద్దామనుకుంటున్నా..



మేం కష్టపడి పండించి తెచ్చిన పంటకు మేం ధర నిర్ణయించే అవకాశం లేకపోయింది. కానీ.. మార్కెట్‌లోని వ్యాపారుల మాత్రం కళ్లతో చూసి పంట ధర నిర్ణయిస్తున్నారు. మంగళవారం జెండాపాటలో రూ.13,500 ధర పలికింది. నాణ్యమైన మిర్చిని తెస్తే జెండాపాటలో కొనకుండా రూ.11 వేలకు అడిగారు. 'ఇస్తే ఇవ్వు.. లేకపోతే ఇంటికి పట్టుకెళ్లు..' అంటూ వెళ్లిపోయారు. చేసేదీమీలేక కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేద్దామని తీసుకెళ్తున్నా.

**–బాదావత్ జగదీశ్, మిర్చి రైతు, తిరుమలాయపాలెం**

### మరీ తక్కువ ధర చెబుతున్నారు..



క్వాలిటీ మిర్చికి కూడా వ్యాపారులు మరీ తక్కువ ధర చెబుతున్నారు. జెండా పాటతో సంబంధం లేకుండా ధరను నిర్ణయిస్తున్నారు. మరి జెండాపాట ఎందుకు పెడుతున్నారని ప్రశ్నిస్తే.. 'ఆ పని అధికారులు చేస్తారు. మేం కొనే ధరకు మేము కొంటాం' అంటూ వ్యాపారులు చెబుతున్నారు. వారి దోపిడీని అధికారులు పట్టించుకోరు.

**–హలావత్ హార్యా, కూసుమంచి**

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో

# రిఫైనరీ యూనిట్ ఏర్పాటుచేయాలి

- ఆఫ్‌టైప్ మొక్కలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి
- ప్రత్యేక ఆయిల్‌పాం బోర్డును ఏర్పాటు చేయాలి
- ఆయిల్‌ఫెడ్ కార్యాలయం వద్ద ధర్నాలో రైతులు
- డివిజనల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేత

అశ్వారావుపేట, ఏప్రిల్ 8: ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఆయిల్‌పాం సాగు విస్తరణ భారీగా పెరగటం వల్ల క్రూడాయిల్ ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అశ్వారావుపేట లేదా దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో రిఫైనరీ(నూనె శుద్ధి) యూనిట్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆయిల్‌పాం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు ఉమామహేశ్వర్‌రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. దీంతోపాటు 2016–2020 మధ్య ఆఫ్ టైప్ ఆయిల్‌పాం మొక్కలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, ఐఐఓపీఆర్ ద్వారా ఆయిల్‌పాం పరిశోధనా కేంద్రం, ప్రత్యేక ఆయిల్‌పాం బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఆయిల్‌పాం రైతు సమస్యలపై మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం ఆయిల్‌ఫెడ్ డివిజన్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు రైతులతో ఆయిల్‌ఫెడ్ ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని, ప్రతి ఏటా మహాజన సభలు నిర్వహించి ఆయిల్‌ఫెడ్ సంస్థ ఆదాయ, వ్యయాలను రైతులకు పారదర్శకంగా వివరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్(డీవో) రాధాకృష్ణకు అందజేశారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు తీసుకుంటానని డీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అన్నవరపు సత్యనారాయణ, వెలమంచిలి వంశీ కృష్ణ, తలసిల ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

# ముంచిన అకాల వర్షం

- గాలివానకు నేలరాలిన మామిడి కాయలు
- నేలకొరిగిన మొక్కజొన్న, విరిగిన మునగ తోటలు
- చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో అన్నదాతల ఆందోళన
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న రైతులు

సత్తుపల్లి టౌన్/ ఎర్రుపాలెం/ టేకులపల్లి/ ఇల్లెందు రూరల్/ కరకగూడెం/ అశ్వారావుపేట/ అశ్వారావుపేట టౌన్/ అశ్వారావుపేట రూరల్/ అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 8: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం సాయంత్రం, మంగళవారం సాయంత్రం గాలిదుమారంతో కూడిన అకాల వర్షం రైతులను నిలువునా ముంచింది. మామిడి, మొక్కజొన్న రైతులను కోలుకోకుండా చేసింది. పక్వానికి వచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. మొక్కజొన్న పంట నేలవాలింది. సత్తుపల్లి మండలం సత్తుపల్లి, బుగ్గపాడు, రుద్రాక్షపల్లి, కాకర్లపల్లి, సిద్ధారం, సదాశివునిపేట, తుంబూరు తదితర గ్రామాల్లో పక్వానికి వచ్చి కోతకు సిద్ధంగా ఉన్న మామిడి కాయలు సోమవారం సాయంత్రం గాలిదుమారంతో రాలిపోయాయి. మామిడి తోటలను లీజుకు తీసుకున్న కౌలు వ్యాపారులు గాలిదుమారం మా నోట్లో మట్టి కొట్టిందని వాపోతున్నారు. ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షంతో మొక్కజొన్న పంట నేలకొరిగింది. మామిడి కాయలు నేలరాలాయి. ఉద్యానవన అధికారి విష్ణు, ఏవో సాయిశివ, ఏఈవో వంశీకృష్ణ.. రాజుపాలెం, బుచ్చిరెడ్డిపాలెం, భీమవరం, మామునూరు, వెంకటాపురం, నారాయణపురం గ్రామాల్లో మంగళవారం పర్యటించి నష్టపోయిన పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో పంపిస్తామని తెలిపారు. టేకులపల్లి మండలం గంగారం, బోడు, కోయగూడెం, చింతోనిచెలక, మేళ్లమడుగు, సంపత్‌నగర్, వజ్జోనిగూడెం తదితర గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలాయి. పలు గ్రామాల్లో చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఇల్లెందు మండలం పోచారం, మర్రిగూడెం, పోలారం, కొమరారం, బోయ తండా, మాణిక్యారం, ముత్తారపుకట్ట, మసివాగు తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు నాయిని రాజు, నాయకులు శ్రీరామ్, కోటయ్య, గాంధీ, రాఘువులు పరిశీలించారు. దెబ్బతిన్న మొక్కజొన్న పంట ఎకరాకు రూ.25 వేలు, వరి పంట ఎకరాకు రూ.35 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కరకగూడెం మండలంలో సోమవారం రాత్రి గాలిదుమారంతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. కరకగూడెం–పినపాక ప్రధాన రహదారిపై చెట్లు కూలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వరి, మిర్చి పంటలకు కొంత మేర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. అశ్వారావుపేట మండలంలో మంగళవారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఊట్లపల్లి వద్ద ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి మామిడి, జీడిమామిడి పంటలకు నష్టం వాటిల్లింది. పొగాకు, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. అరటి పంటలకు సైతం వర్షం తాకిడి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తమామిళ్ల వారిగూడెం గ్రామానికి చెందిన నల్లాని వెంకటేశ్వరరావుకు చెందిన 4 ఎకరాల మునగ తోట నేలమట్టమైంది. పూత, పిందె, కాయ దశలో ఉన్న పంటలు గాలిదుమారంతో నేలపాలయ్యాయి. సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మల్లాయిగూడెం, పండువారిగూడెం, దబ్బతోగు, అనంతారం, తిరుమలకుంట, వినాయకపురం, ఆసుపాక, నారాయణపురంతోపాటు పలు గ్రామాల్లో వర్షం కురవడంతో పొగాకు, గుమ్మడి, మొక్కజొన్న, నాటు పొగాకు, మామిడి, జీడిమామిడి, పుచ్చ రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడులు తగ్గే అవకాశం ఉందని దిగులు చెందుతున్నారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నేలవాలింది. కోసిన ధాన్యం, మిర్చి వర్షానికి తడిసిపోయాయి.



ఎర్రుపాలెం: పడిపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న అధికారి



ఇల్లెందు రూరల్: దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

### ప్రభుత్వమే ఆదుకోవాలి..



రుద్రాక్షపల్లి గ్రామంలో 30 ఎకరాల మామిడి తోటను లీజుకు తీసుకున్నా. సోమవారం సాయంత్రం గాలిదుమారంతో చేతికొచ్చిన పంట అంతా నేలపాలైంది. మార్కెట్‌లో మామిడి టన్ను ధర రూ.30 నుంచి రూ.50 వేల వరకు పలుకుతుంది. గాలిదుమారం, అకాల వర్షంతో లక్షల రూపాయలు కోల్పోవాల్సి వచ్చింది. ప్రభుత్వమే ఆదుకోవాలని కన్నీటి పర్యంతమయ్యాడు.

**–ధరావత్ కృష్ణ, రైతు, రుద్రాక్షపల్లి, సత్తుపల్లి మండలం**



అశ్వారావుపేట – ఊట్లపల్లి రహదారిలో కూలిన చెట్టు



సత్తుపల్లి టౌన్: రాలిన మామిడికాయలు



అశ్వారావుపేట రూరల్: ఈదురుగాలులకు నేలమట్టమైన మునగ తోట

# అర్థమయ్యే విధంగా బోధించాలి

## పాఠశాలల తనిఖీలో ఐటీడీఏ పీవో

టేకులపల్లి, ఏప్రిల్ 8: ప్రాథమిక స్థాయి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు. ఐటీడీఏ పరిధిలోని కోయగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల, టేకులపల్లిలోని కాలనీ తండా గిరిజన ప్రాథమిక పాఠశాలలను మంగళవారం పీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల చేత గణితం, తెలుగు, ఆంగ్ల భాషలోని కొన్ని పదాలను చెప్పి బ్లాక్ బోర్డుపై రాయించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా గణితం, ఇంగ్లిష్ అంటే భయం లేకుండా చూడాలని, ఆయా సబ్జెక్టులపై దృష్టి పెడితే వారికి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో ఇల్లెందు గిరిజన సంక్షేమ సహాయ అధికారి సువర్ణపాక రాధమ్మ, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం బి.అమర్‌సింగ్, విజయ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో బోర్డుపై రాయిస్తున్న పీవో రాహుల్

# జీవో నంబర్ 21ను రద్దు చేయాలి

## ఖమ్మంలో కేయూ వర్సిటీ కాలేజీ ఎదుట పీజీ, వ్యాయామ అధ్యాపకుల ధర్నా



ఖమ్మంలోని కేయూ పీజీ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న అధ్యాపకులు

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 8: జీవో నంబర్ 21ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలంటూ ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ, వ్యాయామ కళాశాలల అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తరగతులు బహిష్కరించి కళాశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులను క్రమబద్ధీకరించకుండా నేరుగా అధ్యాపకుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 21ను ఉపసంహరించుకునే వరకు దశల వారీగా ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. ప్రిన్సిపాల్ రవికుమార్, గోపీ, శ్యామ్, కోటి, శేఖర్, వీరాంజనేయులు,రమ, లక్ష్మీహరిత, వీరన్న, రాజీవ్‌రాజ్, చలపతిరావు పాల్గొన్నారు.